క్లుప్తంగా

గోపాలపట్నం పీఎస్‌ను తనిఖీ చేసిన డీసీపీ



గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో సీఐ సురేష్, సిబ్బందికి సూచనలిస్తున్న డీసీపీ సత్తిబాబు

గోపాలపట్నం: గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌ను జోన్–2 డీసీపీ ఎం. సత్తిబాబు శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో సిబ్బంది పనితీరు, పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. వారెంట్లు, స్టేషన్ రికార్డులను పరిశీలించారు. సీఐ సురేష్‌బాబుకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు ఎస్‌ఐలు అప్పలనాయుడు, రామకృష్ణ కేసుల వివరాలను డీసీపీకి వివరించారు. డీసీపీ మాట్లాడుతూ నిజాయితీ, నిబద్ధతతో పని చేయాలన్నారు. సమస్యలు తెలిపేందుకు స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాద పూర్వకంగా మెలగాలని సూచించారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఫార్మాసిటీ ఎండీ లాల్‌కృష్ణ తదితరులు

పరవాడ: రాంకీ ఫౌండేషన్ సౌజన్యంతో ఫార్మాసిటీ క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జర్నలిస్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో పరవాడ జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో విశాఖ వెబ్‌టైగర్స్, తృతీయ స్థానంలో విశాఖ వెబ్ వారియర్స్ జట్లు నిలిచాయి. విజేతలకు శుక్రవారం ఫార్మాసిటీ ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ, పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, సీఐ ఎస్.బాలసూర్యారావు, ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ భక్షి, లైజనింగ్ ఏజీఎం రాఘవ రెడ్డి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ శ్రీకాంత్ బహుమతులు అందజేశారు.

నేడు 'ఆసరా' చెక్కుల పంపిణీ

సబ్బవరం: మండలంలోని డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం చేపట్టనున్నట్లు వెలుగు ఏపీఎం సాయి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని చెక్కుల పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.4వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మండలంలోని 14,873 మంది లబ్ధిదారులకు రూ.13.53 కోట్లు అందించనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: మండలంలోని రాంపురం 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. రాంపురం, గొల్లపేట, ఎస్సీ కాలనీ, గండి పేట, చిలకపేట, చిన ముషిడివాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



వేంకటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు రామానుజాచార్యులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకాలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

భాస్కరాయ.. నమో నమః



సుజాతనగర్‌లో పూజలందుకున్న ఆదిత్యుడు



గోశాలలో సూర్యభగవానుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఘనంగా రథసప్తమి వేడుకలు

పెందుర్తి: ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడి నామస్మరణతో పెందుర్తి మార్మోగింది. రథసప్తమి పురస్కరించుకుని శుక్రవారం ఆదిత్యుడిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. వెంకటాద్రి సమీపంలోని సూర్య దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సామూహిక సూర్య నమస్కారాలు చేశారు. ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు జరిపారు. విశేష అలంకరణలో సూర్యనారాయణమూర్తి భక్తులకు దర్శనం ఇచ్చారు. సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పాత్రల్లో పాయసం తయారు చేసిన భక్తులు స్వామికి నైవేద్యం సమర్పించారు. ఇక్కడ నిర్వహించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, వేలాది మంది సూర్యనారాయణస్వామిని దర్శించుకున్నారు.

సుజాతనగర్‌లో పూజలు

సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని సూర్యదేవాలయం, ఆంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. సూర్యభగవానుడి ఆలయంలో రథసప్తమి ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి సారథ్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు మారుతి చేతుల మీదుగా ఆదిత్యునికి ప్రత్యేక పూజలు చేశారు.సాయంత్రం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

అప్పన్న గోశాలలో ..

సింహాచలం: రథ సప్తమిని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురం గోశాలలో ఉన్న సప్త అశ్వ వాహన సమేత సూర్యనారాయణస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భారీగా తరలివచ్చారు. దేవస్థానం అర్చకులు స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సూర్యనమస్కారాలు చేశారు.





పెందుర్తిలో పూజలందుకున్న సూర్యభగవానుడు, క్యూలో భక్తులు



పాయసం వండుతున్న భక్తులు

కల్యాణం.. కమనీయం



స్వామికి జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. రథసప్తమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని హంస మూలన ఉన్న రాతిరథంపై స్వామికి కల్యాణం నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను రాతిరథంపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు, అక్షింతలు అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, అర్చకుడు పవన్ తదితరులు కల్యాణం నిర్వహించారు.

సమ్మెకు మద్దతుగా ర్యాలీ



సినిమాహాలు కూడలిలో నిరసన తెలుపుతున్న కార్మికులు

పరవాడ: అసంఘటిత రంగ కార్మికుల కోసం సమగ్ర చట్టం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. భారత కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక సినిమా హాలు కూడలిలో అసంఘటిత కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా కుదించడం దుర్మార్గమని మండిపడ్డారు. రవాణా రంగ కార్మికులపై ఉరితాడు లాంటి బీఎస్ఎస్ చట్టాన్ని రద్దు చేయాలని, ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ఎస్.గురునాథరావు, జి.శ్రీను, ఆర్.కన్నబాబు, పైల అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా అక్కులమ్మ పేరంటాలు తీర్థం



అక్కులమ్మను దర్శించుకుంటున్న పెద్దలు



కోలాటం ఆడుతున్న మహిళలు

సబ్బవరం: మండలంలోని రావలమ్మపాలెం గ్రామంలో అక్కులమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అక్కులమ్మకు ధూప, దీప నైవేద్యాలతో పూజలు చేశారు. వీకేపీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు అమ్మవారిని దర్శించుకుని అనంతరం అన్న సమారాధనను ప్రారంభించారు. అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన మహిళల కోలాటం ఆకట్టుకుంది. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన అట్టహాసంగా జరిగింది. జక్కాన శ్రీరామమూర్తి, సూర్యవెంకటరావు, సత్యనారాయణ, సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

కమలాంబికగా రాజశ్యామల



కమలాంబిక అలంకరణలో రాజ శ్యామల అమ్మవారు

సబ్బవరం: మండలంలోని దేవీపురంలో శ్యామ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజు శుక్రవారం రాజశ్యామల అమ్మవారు కేతికి పుష్పాలు, తామర పత్రాల అలంకరణలో కమలాంబికగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.చెన్నైలోని కుంభకోణం నగరం నుంచి రప్పించిన సువాసన వెదజల్లే కేతకి పుష్పాలు, తామర పత్రాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. రథసప్తమి కావడంతో ఉత్సవ మూర్తికి భక్తులు క్షీరాభిషేకం,షోడశోపచార పూజ నిర్వహించారు. అలాగే రాజశ్యామల అమ్మవారి సన్నిధిలో రాజశ్యామల హోమం నిర్వహించారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం గురుమాత అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో దేవీపురం నిర్వాహకులు కందర్ప ప్రభాకర్, ట్రస్ట్ కార్యదర్శి కందర్ప రమా, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

తెరపైకి మరోసారి రింగు వలల వివాదం

మత్స్యకార ప్రాంతంలో పోలీసు బందోబస్త్



జాలరిపేటలో పోలీసుల బందోబస్త్

ఎంవీపీకాలనీ: రింగువలల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. రింగు వలల వేట గత కొంతకాలంగా మత్స్యకారుల మధ్య వివాదాన్ని రేపుతున్న విషయం తెలిసిందే. రింగు వలల వేటను తొలినుంచి 19వ వార్డు వాసవానిపాలెం, జాలరి ఎండాడ మత్స్యకారులు స్వాగతిస్తుండగా, పెద జాలరిపేట మత్స్యకారులు వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య గతంలో భారీస్థాయిలో ఘర్షణలు తలెత్తాయి. తీవ్రస్థాయిలో ఆస్తి నష్టం కూడా జరిగింది. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య సమస్యను పరిష్కరించేందుకు కలెక్టర్ ఆదేశాలతో మత్స్యకార శాఖ పలు సమావేశాలు నిర్వహించింది. పలుమార్లు ఇరువర్గాల మధ్య ఈ సమావేశాలు జరిగినా వివాదం కొలిక్కిరాలేదు. అయితే వాసవానిపాలెం, జాలరి ఎండాడ మత్స్యకారులు రింగువలలతో వేట వెళ్లేందుకు సిద్ధమయ్యారు. దీంతో మరోసారి గొడవలు జరిగే అవకాశం ఉండటంతో పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాత్రి పూట కూడా పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. పోలీసు ఉన్నతాధికారులు ఆయా మత్స్యకార గ్రామాల పెద్దలతో చర్చలు జరుపుతున్నారు.

పాలిటెక్నిక్‌తో ఉపాధి అవకాశాలు అపారం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపకులు

పెందుర్తి: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అభ్యసించడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. 2014 పాలిసెట్ పోస్టర్‌ను కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో స్కిల్‌హబ్ ద్వారా నిరుద్యోగ యువతకు తర్ఫీదు ఇచ్చి ఉపాధి అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. అనంతరం కళాశాల అధ్యాపక బృందం సమీపంలోని పాఠశాలలను సందర్శించి పాలిటెక్నిక్ చేయడం ద్వారా లభించే ఉపాధి అవకాశాలను వివరించారు.

'నేషనల్ యూత్ పార్లమెంట్ ఉత్సవ్'కు ఎంపికలు



మాట్లాడుతున్న మహేశ్వరరావు

బీచ్ రోడ్డు: దేశ పార్లమెంటును యువతకు పరిచయం చేసేందుకు భారత ప్రభుత్వం చేపడుతున్న నేషనల్ యూత్ పార్లమెంట్ ఉత్సవ్‌కు క్షేత్ర స్థాయి ఎంపికలను ప్రారంభించినట్లు జిల్లా నెహ్రూ యువ కేంద్ర అధికారి మహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బీచ్‌రోడ్డులోని నెహ్రూ యువ కేంద్రం కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లాల యువతకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. శనివారం శ్రీకాకుళం, యానాం జిల్లాలకు చెందిన యువతకు పోటీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్తారని, రాష్ట్రం నుంచి 35 మందిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. జాతీయ స్థాయిలో విజేతగా నిలిచిన వారికి నగదు బహుమతి ఉంటుందన్నారు. శుక్రవారం నిర్వహించిన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ జె.అరుణ, డాక్టర్ కె.అనిత, డాక్టర్ శీతల్ తదితరులు వ్యవహరించారు.

అనారోగ్యంతో స్మార్ట్‌సిటీ ఈఈ మృతి



ఈఈ సుధాకర్ (ఫైల్)

దాబాగార్డెన్స్ : అనారోగ్య కారణాలతో స్మార్ట్ సిటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. సుధాకర్ శుక్రవారం మృతి చెందారు. స్మార్ట్ సిటీ ఏర్పాటుకు ముందు నుంచి జీవీఎంసీలో సుధాకర్ విధులు నిర్వర్తిస్తున్నారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

ప్రైవేటీకరణతో కార్మికుల భవిష్యత్తు అంధకారం



1100వ రోజు దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న సీహెచ్ నర్సింగరావు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల కార్మికుల జీవనోపాధి పోతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో కార్మికులు, ఉక్కు నిర్వాసితుల భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 1100వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా అఖిలపక్ష సంఘాల ప్రతినిధులు, సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుంటేనే దేశ భవిష్యత్తు బాగుంటుందన్నారు. కార్మికుల హక్కులు, సదుపా…యాలు కొనసాగాలంటే స్టీల్ ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలన్నారు. డాక్టర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను పరిరక్షించి సామాజిక న్యాయం కోసం స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించే వరకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, అయోధ్యరామ్, గణపతిరెడ్డి, రామకృష్ణ, వర్షాల శ్రీనివాస్, ప్రసాద్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక నేడు

గాజువాక : గుంటూరు జిల్లాలో ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించనున్న 33వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాల బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి విశాఖ జిల్లా జట్లను శనివారం ఎంపిక చేయనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జె.ఎస్.వి.ప్రసాదరెడ్డి తెలిపారు. ఎంపిక పోటీలు పెదగంట్యాడ మండలం నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు తెలియజేశారు. 16 ఏళ్ల లోపు వయసు, 55 కేజీల బరువు గలవారు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వివరాల కోసం 96666 55355, 80084 85344 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రెండు రోజులు అంతర్జాతీయ చర్చావేదిక



మీడియాతో మాట్లాడుతున్న రాఘవేంద్రన్

సీతమ్మధార : శివానంద సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారత సాంస్కృతిక చరిత్ర పునర్నిర్మాణం–సంశయాలు, దృక్పథాలు అనే అంశంపై ఎంవీపీ కాలనీలోని ఐఐఎం కళాశాలలో ఫిబ్రవరి 18,19 తేదీల్లో రెండు రోజుల పాటు అంతర్జాతీయ చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు ప్రొఫెసర్లు ఆర్. రాఘవేంద్రన్, వై.సుదర్శనరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆశీలమెట్టలోని ఒక హోటల్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ధర్మం ప్రాతిపదికగా భారతీయ సమాజం ఏర్పడిందన్నారు. ప్రాచీన భారతీయ సాహిత్యం, వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు అందరినీ ఆకర్షిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ ఎస్.రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీని తగ్గించి వారికి సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె. త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా..

- టాటా–ఎర్నాకుళం(08189) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19, 26 తేదీల్లో తెల్లవారు 5.15 గంటలకు టాటాలో బయల్దేరి అదే రోజు రాత్రి 8.43 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 8.45 గంటలకు బయల్దేరి మూడో రోజు మధ్య రాత్రి 1.55 గంటలకు ఎర్నాకుళం చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో ఎర్నాకుళంలో ఈ నెల 22, 29 తేదీల్లో ఉదయం 7.15 గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.08 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 12.10 గంటలకు బయల్దేరి మూడో రోజు వేకువజాము 4.35 గంటలకు టాటా చేరుకుంటుంది.

- కన్యాకుమారి–డిబ్రూఘడ్(06103) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16, మార్చి 1, 15, 29 తేదీల్లో (శుక్రవారాలు) సాయంత్రం 5.25 గంటలకు కన్యాకుమారిలో బయల్దేరి మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు విశాఖ వచ్చి, ఇక్కడ నుంచి 12.05 గంటలకు బయల్దేరి సోమవారాల్లో రాత్రి 8.50 గంటలకు డిబ్రూఘడ్ చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో డిబ్రూఘడ్– కన్యాకుమారి(06104) స్పెషల్ ఈ నెల 21, మార్చి 6, 20, ఏప్రిల్ 3 తేదీల్లో రాత్రి 7.55 గంటలకు డిబ్రూఘడ్‌లో బయల్దేరి మూడో రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు విశాఖపట్నం వచ్చి, అక్కడ నుంచి 3.50 గంటలకు బయల్దేరి శనివారాల్లో రాత్రి 9.55 గంటలకు కన్యాకుమారి చేరుకుంటుంది.

- కన్యాకుమారి–డిబ్రూఘడ్(06105) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26, మార్చి 8, 22, ఏప్రిల్ 5 తేదీల్లో(శుక్రవారాలు) సాయంత్రం 5.25 గంటలకు కన్యాకుమారిలో బయల్దేరి మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు విశాఖపట్నం వచ్చి, ఇక్కడ నుంచి 12.05 గంటలకు బయల్దేరి సోమవారాల్లో రాత్రి 8.50 గంటలకు డిబ్రూఘడ్ చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో డిబ్రూఘడ్– కన్యాకుమారి(06106) స్పెషల్ ఈ నెల 28, మార్చి 13, 27, ఏప్రిల్ 10 తేదీల్లో రాత్రి 7.55 గంటలకు డిబ్రూఘడ్‌లో బయల్దేరి మూడో రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు విశాఖపట్నం వచ్చి, ఇక్కడ నుంచి 3.50 గంటలకు బయల్దేరి శనివారాల్లో రాత్రి 9.55 గంటలకు కన్యాకుమారి చేరుకుంటుంది.

పలు రైళ్ల రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఆయా స్టేషన్ల నుంచి శుక్రవారం పలు రైళ్లు ఆలస్యంగా బయల్దేరుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. లింక్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున ఈ రైళ్లు రీషెడ్యూల్ చేసినట్లు పేర్కొన్నారు. ◆ శుక్రవారం ఉదయం 10 గంటలకు బయల్దేరవలసిన చెన్నై సెంట్రల్– భువనేశ్వర్(12829) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 3 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయల్దేరింది. ◆ శుక్రవారం ఉదయం పురూలియాలో 10 గంటలకు బయల్దేరవలసిన పురూలియా–విల్లుపురం (22605) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4 గంటలకు బయల్దేరింది.

◆ శుక్రవారం ఉదయం 10.15 గంటలకు బెంగళూరులో బయల్దేరవలసిన బెంగళూరు–అగర్తలా(12503) ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4 గంటలకు బయల్దేరింది.

484 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: పెందుర్తి మండలం సరిపల్లి పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన లభించింది. శిబిరాల్లో మొత్తం 484మందిపేర్లు నమోదు చేసుకున్నారు. స్పెషలిస్టు వైద్యులు గైనకాలజిస్టు, జనరల్ మెడిసిన్,ఆర్థోపెడిక్,డెంటల్ వైద్యులు సేవలందించారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. వైద్య సేవల అనంతరం రోగులకు ఉచితంగా మందులు ఇచ్చారు. వైద్య శిబిరాన్ని నోడల్ అధికారి డాక్టర్ ఉమావతి సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

20న శిబిరాలు జరిగే ప్రాంతాలు

ఈనెల 20న భీమిలి మండలంలోని ఆర్.తాళ్లవలస సచివాలయం పరిధిలోని అమనాం, పద్మనాభం మండలంలో రేవిడి,ఆనందపురం మండలంలోని పాలవలస గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరుగుతాయని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.